సాక్షి కర్నూలు

ఆదివారం । 18 । జూన్ । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఎం.నరేష్‌గౌడ్ రూ.1,00,116 విరాళాన్ని అందించారు.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన దీక్షిత్ అకాడమీ కళాకారులు నృత్యాన్ని ప్రదర్శించారు.

న్యూస్‌రీల్

మట్టి నమూనాల సేకరణలో జిల్లాకు 5వ స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): భూసార పరీక్షల నిర్వహణకు మట్టి నమూనాలు సేకరించడంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. ఈ నెల చివరిలోగా జిల్లా మొత్తంగా 10,252 భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలను కూడా రైతులకు అందించాలనేది వ్యవసాయ శాఖ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో మట్టి నమూనాలు సేకరించడంలో వ్యవసాయ యంత్రాంగం నిమగ్నమైంది. యాప్ సరిగా పనిచేయక పోవడం వల్ల మొదటి రోజు మట్టి నమూనాలు సేకరించడంలో జాప్యం జరిగినట్లు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. అయినప్పటికీ జిల్లా మొత్తంగా 929 మట్టి నమూనాలు సేకరించామన్నారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



కానిస్టేబుల్ అన్సర్ బాషా కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సహోద్యోగులు

కర్నూలు: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ ఎస్.అన్సర్ బాషా మృతి చెందగా, తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు అతని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. తమ వంతు సహాయంగా సేకరించిన రూ.2.87 లక్షల నగదును శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా షేక్ అన్సర్ బాషా భార్య షేక్ సన అఫ్రీన్‌కి అందజేశారు. కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉంటూ డిప్యుటేషన్‌పై పంచలింగాల సెబ్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తూ గత నెలలో కానిస్టేబుల్ ఎస్.అన్సర్ బాషా మృతి చెందిన విషయం తెలిసిందే.

ఐటీఐలో ప్రవేశానికి మరో అవకాశం

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరు కాని, హాజరైన సీట్లు రాని వారికి మరో అవకాశం ఇవ్వనున్నట్లు ఐటీఐ కాలేజీల కన్వీనర్ పి.వి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరందరూ రేపు(సోమవారం)బి.తాండ్రపాడులోని బాలికల ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చుని సూచించారు. బాలికలు హాజరుకాకపోతే బాలురకు సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.



పదో తరగతిలో రెండో బహుమతి అందుకుంటున్న గుడిసె మనోహర్, మూడో బహుమతి అందుకుంటున్న లీలామనోహర్ రెడ్డి





అవార్డు స్వీకరిస్తున్న బోయ సుష్మ (ఇంటర్‌లో మొదటి స్థానం)



హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పేద విద్యార్థులకు ఉన్నత చదువులు

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్య కోసం అధిక కేటాయింపులు
- నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి పథకాలతో విప్లవాత్మక మార్పు
- జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- పదిలో 26 మందికి, ఇంటర్‌లో 19 మందికి క్యాష్ అవార్డుల అందజేత

కర్నూలు(సెంట్రల్): పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకోసం విద్యా రంగానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా నిధులు కేటాయిస్తున్నారని జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. గతంలో బడ్జెట్‌లో విద్యకు కేవలం 5 శాతం నిధులు మాత్రమే కేటాయించేవారని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక 30 నుంచి 40 శాతం నిధులు కేటాయిస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివి పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన 26 మందికి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన 19 మందికి జిల్లాస్థాయిలో నగదు అవార్డులు అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.50 వేలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.30వేలు, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.15 వేల నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ.. పేదలను దృష్టిలో ఉంచుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చారన్నారు. మనబడినాడు–నేడు కింద పాఠశాల రూపురేఖలు మార్చారన్నారు. జగనన్న అమ్మ ఒడి ద్వారా ఏడాదికి రూ,15 వేలు ఇస్తున్నారన్నారు. ఇంటర్ తరువాత వివిధ కోర్సులు చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు జగనన్న వసతి దీవెనకింద మెస్ చార్జీల కోసం రూ.20వేలు ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్నారని చెప్పారు.



పదో తరగతిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిన ఈడిగ గణేష్‌కు నగదు బహుమతిని అందజేస్తున్న కలెక్టర్ సృజన, చిత్రంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల, ఎంపీ సంజీవ్ కుమార్, మేయర్ రామయ్య తదితరులు

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. బాగా చదువుకుంటే జీవితంలోనే ఉన్నత స్థానంలో స్థిరపడవచ్చన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ఎంతో గొప్పదని, ఇది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ సంవత్సరం మార్కులు తెచ్చుకోలేని విద్యార్థులు వచ్చే ఏడాదిలో ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉందన్నారు.
- కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో విద్యా బోధన చేయాల్సి ఉందన్నారు. నాలుగు యాప్‌ల్లో వివరాలు అప్‌లోడ్ చేయాలని చెబితే గోల చేయడం మంచికాదని, అదే ఉపాధ్యాయులు గంటల తరబడి సెల్‌ఫోన్‌ను వినియోగించడం లేదా అని ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థి కోసం ప్రభుత్వం రూ.90 వేలు ఖర్చు చేస్తోందని, అదే ప్రైవేట్ బడుల్లో కేవలం రూ. 30 వేలతోనే నాణ్యమైన విద్య అందుతుండడాన్ని ఉపాధ్యాయులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు.
- కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ..సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, నాలుగేళ్లలో రూ. 60వేల కోట్లను ఖర్చు చేశారన్నారు. అమ్మ ఒడి, నాడు-నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు, జగనన్న వసతి, విద్యా దీవెన పథకాలను అమలు చేసి పేద విద్యార్థుల చదువుల భారాన్ని సీఎం మోస్తున్నారన్నారు. విద్యార్థులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థానంలో ఉండాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ కె.వేణుగోపాల్, ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి, డీవీఈఓ జమీర్‌బాషా, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

మొదటి మూడు బహుమతులు అందుకున్న పదో తరగతి విద్యార్థుల వివరాలు..

మహాత్మాజ్యోతిబా గురుకుల విద్యాలయాలు
ఈడిగ గణేష్ (గోరంట్ల), గుడిసె మనోహర్, (గోరంట్ల), గంగుల లీలామనోహర్‌రెడ్డి(గోరంట్ల)

జీటీడబ్ల్యు (గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్) స్కూళ్లు
ఆశ్రమాలు: బోయ మల్లయ్య(ఆలూరు), రమవత్ గణేష్ నాయక్(ఆలూరు), సుగాలి రాజ్ కుమార్ నాయక్(ఆలూరు)

కస్తూర్బాగాంధీ విద్యాలయాలు
కుమ్మరి చందు(ఎమ్మిగనూరు), షేక్ ఫిర్దోస్ బాను(ఆదోని), మాల శివలింగమ్మ(ఆదోని)

ఏపీ మోడల్ స్కూళ్లు
బి. ఉదయకిరణ్ (కడివెళ్ల), కమ్మరి నవీన్ (పత్తికొండ), తలమారి రాజేష్(కోడుమూరు)

ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు
హరిజన వాసంతి(బనవాసి), దూదేకుల లాల్‌మహ్మద్, గద్దం భాను ప్రకాష్ (కాల్వబుగ్గ), సుగాలి వీరేష్ నాయక్ (కాల్వబుగ్గ)

ఏపీఎస్‌డబ్ల్యుఆర్ స్కూళ్లు
గొల్ల దేవిక(ఆరేకల్) , కె.ఇందిర (ఆరేకల్), రేపల్లె అనిత, మల్లెపోగు శైలజ (కర్నూలు)

ఏపీటీడబ్ల్యుఆర్ ఈఎం స్కూళ్లు
కర్నాటి లహరి(బీక్యాంపు కర్నూలు), సుజాత (ఆలూరు), సుగాలి తేజోవతి (ఆలూరు)

జెడ్పీ హైస్కూళ్లు
దండి అభయ్ చరణ(సంతకుడ్లూరు), సుశ్రిత (కర్నూలు), ప్రవీణ్‌కుమార్ (మదిరె)

ఇంటర్‌లో విభాగాల వారీగా అవార్డులు అందుకున్న వారి వివరాలు..

గవర్నమెంట్ జూనియర్ కళాశాలలు
ఎన్నం కీర్తన(బైపీసీ,టౌన్ మోడల్), సాయి కీర్తన(సీఈసీ, కేవీఆర్), బీఏ శేషాద్రి(హెచ్‌ఈసీ, కర్నూలు), భువనేశ్వరి(ఎంపీసీ, కేవీఆర్)

సోషల్ వెల్ఫేర్ కాలేజీలు
పి.మనోహర్(బైపీసీ, కల్లూరు), ఎరుకలి ఐశ్వర్య(హెచ్‌ఈసీ , కృష్ణగిరి), వై. నాగమల్లి (ఎంఈసీ,కృష్ణగిరి), ఆర్.కిరణ్‌కుమార్ (ఎంపీసీ, కల్లూరు)

ఏపీ మోడల్ కళాశాలలు
చాకలి రాణి(బైపీసీ, కృష్ణగిరి), కుమ్మరి అరుణ (సీఈసీ, కల్లూరు), జయప్రకాష్(ఎంపీసీ, ఆలూరు)

కేజీబీవీ కాలేజీలు
మాదిగ శిరీష(బైపీసీ, కోడుమూరు), బి.కాంచన(ఎంపీసీ, గూడూరు)

ఏపీఆర్ జూనియర్ కాలేజీలు
గౌతం భార్గవి (బైపీసీ, ఎమ్మిగనూరు), కుమ్మరి అనిత(ఎంఈసీ, ఎమ్మిగనూరు), బోయ సుష్మ(ఎంపీసీ, ఎమ్మిగనూరు)

బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలు
పార్వతి (బైపీసీ,ఆదోని), వడ్ల కవిత (సీఈసీ, ఆదోని), బిజ్జ శిరీష (ఎంపీసీ, ఆదోని)

సత్కారం గొప్ప విషయం



జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినందుకు సంతోషంగా ఉంది. నగదు పురస్కారాన్ని ఇంటర్ చదివేందుకు ఉపయోగిస్తాను. నాతో పాటు మా తల్లిదండ్రులను కూడా సత్కరించడం గొప్ప విషయం. ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. – గద్దం భానుప్రకాష్, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, కాల్వబుగ్గ

చాలా ఆనందంగా ఉంది



మా నాన్న చనిపోయాడు. మా అమ్మ దేవాలయంలో చిన్నపాటి ఉద్యోగం చేస్తూ నన్ను చదివించింది. నాకు 1000కి గాను 970 మార్కులు వచ్చాయి. జగనన్న ఆణిముత్యాలు కింద రూ.50 వేల నగదు పురస్కారం అందడం చాలా ఆనందంగా ఉంది. ఈ నగదును ఉన్నత చదువులు చదివేందుకు, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం ఉపయోగించుకుంటాను. – కీర్తన, ఇంటర్ విద్యార్థిని, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కర్నూలు.

ఈసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(టౌన్): జిల్లాలో స్వచ్ఛ ఈసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ సీఈఓ సీహెచ్. శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు వచ్చే నెల 2వ తేదీలోపు www.swacheseva.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులు, వికలాంగులు, పదవీ విరమణ ఉద్యోగులు, మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజిస్ట్రేషన్ ఫీజుల్లో తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9154252555 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజలకు సేవ చేసే పెద్ద కార్మికుణ్ని

- మంత్రి గుమ్మనూరు జయరాం



మంత్రిని సన్మానిస్తున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులు



దివ్యాంగులకు మూడుచక్రాల మోటారు బైక్‌లు అందజేసిన మంత్రి గుమ్మనూరు

ఆలూరు: రాజకీయ పదవులు శాశ్వతం కాదని, తాను ప్రజలకు చేసే సేవ పెద్ద కార్మికుడినని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆలూరులోని వాసవీ కల్యాణ మండపంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులతో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు.. ప్రజలకు అండగా నిలిచి కార్మికుల్లా పనిచేసినప్పుడే పేరు వస్తుందన్నారు. పదవులు అశాశ్వతమని, చేసిన సేవే మిగిలిపోతుందన్నారు. తాను 2014లో ఎమ్మెల్యేగా పనిచేశానని, 2019 నుంచి ఇప్పటివరకు మంత్రి కొనసాగుతున్నానని, ఉద్యోగుల పట్ల ఎప్పుడూ దురుసుగా ప్రవర్తించలేదన్నారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాడిన పెడుతున్నారని, ఉద్యోగుల సంక్షేమం కోసం జీపీఎస్ అమలు చేస్తున్నారన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీఓల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంటోని, హాల్వి తహసీల్దార్ మల్లికార్జునస్వామి, నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకుడు మోహన్, యూటీఎఫ్ నాయకుడు ఖాశీం మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత నారాయణస్వామి, న్యాయవాదుల సంఘం నాయకుడు వీరేష్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుడు మల్లికార్జునస్వామి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు నాగరాజ్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆత్మస్థైర్యమే ఆయుధం

ఆత్మస్థైర్యమే ఆయుధంగా దివ్యాంగులు ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతుల సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ సమక్షంలో శనివారం స్థానిక మంత్రి నివాస కార్యాలయంలో మూడు చక్రాల మోటార్ సైకిళ్లను ఐదుగురికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 17,500 మంది దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ. 1.50 లక్షలు ఖర్చు చేసి ట్రై మోటారు సైకిళ్లను పంపిణీ చేసిందన్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు, గమ్యస్థానాలకు సులువుగా చేరేందుకు ఈ బైక్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వచ్చి అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, క్రీడల్లో రాణిస్తూ కొందరు దివ్యాంగులు.. వికలత్వం శరీరానికేనని, మనస్సుకు కాదని నిరూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత నారాయణస్వామి, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీమ్ నాయుడు, లింగంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాధర్‌రెడ్డి, మండల కో–కన్వీనర్ హనుమయ్య, గోవిందు, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-2 పోస్టుల భర్తీకి నేడు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెంచేందుకు మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించనున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఎంఈఓలు వన్‌గాను, కొత్తగా నియమించనున్న వారిని ఎంఈఓ–2లుగా పరిగణించనున్నారు. వీరి ఎంపిక కోసం నేడు(ఆదివారం) కర్నూలు ఏక్యాంపులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మండల విద్యాధికారులతో పాటు గ్రేడ్–2 హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- ఈనెల 23న 'జగనన్న సురక్ష' ప్రారంభం

కర్నూలు(సెంట్రల్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శనివారం విజయవాడ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి భరత్‌గుప్తా, ముత్యాలరాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల్లో అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారికి న్యాయం చేయడంతో పాటు కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ తదితర అవసరమైన పత్రాలను తక్షణమే అందించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకోసం ప్రతి సచివాలయం పరిధిలో సభలను ఏర్పాటు చేసి అక్కడికి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంగా, తహసీల్దార్ ఈఓఆర్డీ మరో బృందంగా ఏర్పడి గ్రామాలను సందర్శించాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి నాలుగు వారాల్లో అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న ప్రతి కుటుంబాన్ని సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలో ఏర్పాటు చేసిన ప్రతి బృందం సోమవారం, సాధారణ సెలవు రోజుల్లో రోజు విడిచి రోజు, రోజుకు రెండు సచివాయాలు, అర్బన్‌లో అయితే కనీసం 5 సచివాలయాలను సందర్శించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించే తేదీని వారం రోజుల ముందుగానే సంబంధిత సచివాలయం పరిధిలోని వలంటీర్లకు తెలియజేస్తే ప్రజలకు అవగాహన కల్పించే వీలుంటుందని తెలిపారు.





క్లుప్తంగా

ఉర్దూ వర్సిటీలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (న్యూసిటీ): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సులో మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు బీఏ ఎకనామిక్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ కోర్సుల్లో చేరవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందు కోసం https:// cets.apsche.ap.gov.in లేదా apschehome. aspx వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీలోగా విద్యార్థులు వెబ్ ఆప్షన్‌లో డాక్టర్ అబ్దుల్ ఉర్దూ యూనివర్సిటీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. జూలై 3వన సీట్లు కేటాయింపు ఉంటుందని, 4న యూనివర్సిటీలో రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు 8520053995, 7901628490 నంబర్లను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

నీట్ పీజీలో మణిదీప్‌కు రెండో ర్యాంకు


కృష్ణమణిదీప్ యాదవ్

కర్నూలు సిటీ: నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పీజీలో జిల్లాకు చెందిన విద్యార్థి కృష్ణమణిదీప్ యాదవ్ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. కర్నూలు మండలం ఈ. తాండ్రపాడు గ్రామానికి చెందిన పుల్లగూర శివరాం బాబు, వరలక్ష్మీ దంపతుల కుమారుడైన కృష్ణమణి దీప్ యాదవ్ అనంతపురం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఈ ఏడాది మార్చిలో పీజీ ప్రవేశం కోసం నీట్ రాయగా 800 మార్కులకుగాను 667 వచ్చాయి. జాతీయ స్థాయిలో 151, రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించారు. కృష్ణమణి దీప్ యాదవ్‌ను కుటుంబ సభ్యులతో పాటు, పలువురు అభినందించారు.

కల నెరవేరకుండానే 'కథ' ముగిసింది

● అనుమానాస్పద స్థితిలో రచయిత మృతి

ఫిల్మ్ నగర్: ఎన్నో సినిమా కథలు రాశాడు. ఎన్నో పాత్రలు సృష్టించాడు. వాటికి ప్రాణం పోశాడు. వెండి తెర మీద చూసి మురిసిపోదామనుకున్నాడు. కానీ పరిస్థితులు కలిసిరాక అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయాడు. వందలాది కథలు రాసుకున్న ఆయన 'కథ' అర్ధాంతరంగా ముగిసింది. ఇది ఓ రచయిత విషాద గాథ. ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాల్లోకి వెళితే.. కర్నూలు జిల్లాకు చెందిన నేపల్లి కీర్తిసాగర్ (50) సినిమాల్లో కథలు రాయడంపై మక్కువతో చాలా ఏళ్ల క్రితం నగరానికి వచ్చాడు. షేక్ పేట్ పరిధిలోని ఓ పెంట్ హౌస్‌లో నివాసం ఉంటున్నాడు. సినిమా కథలతో పాటు సహాయ దర్శకుడిగా అవకాశాల కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారు జామున టెర్రస్‌పై విగత జీవిగా కనిపించాడు. ఇది గమనించిన స్నేహితుడు 108 కు సమాచారం అందించాడు. వారు వచ్చి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గత కొంత కాలంగా సినిమాల్లో అవకాశాలు రాక పోవడంతో డిప్రెషన్‌లోకి వెళ్ళాడు. స్నేహితుడు రాధాకృష్ణ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అతని గదికి వెళ్లి చూడగా తాను రాసుకున్న వందలాది కథలు గది నిండా ఉన్నాయి. వాటిని చూసి పోలీసులే ఆశ్చర్యపోయారు. అతని మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు.


కీర్తిసాగర్ (ఫైల్)

ప్రియుడు మోసం చేశాడని యువతి ఆందోళన

బేతంచెర్ల: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఓ అమ్మాయి బేతంచెర్ల పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. గోర్లగుట్ట గ్రామానికి చెందిన ఓవుల నాగభూషన్న, యశోదమ్మ దంపతుల కుమారుడు మనోహర్ జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు. కాగా మనోహర్ శుక్రవారం వేరే యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో న్యాయం చేయాలని బాలిక తన కుటుంబీకులతో కలసి శనివారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. నాలుగు రోజుల క్రితం స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, అందుకే పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన దిగానన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ వివరణ కోరగా బాధితురాలి తల్లిదండ్రులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు చేస్తే పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామన్నారు.

మనస్తాపంతో బలవన్మరణం

కొత్తపల్లి: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నగుమ్మడాపురం గ్రామంలో చోటు చేసుకుంది. జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామంలో నివాసముంటున్న రంగస్వామి (58) ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో నడుము, కాలు విరిగింది. భార్య శివమ్మనే సపర్యలు చేసేది. ఇంటికే పరిమితం కావడంతో రంగస్వామి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం సొంత గ్రామమైన చిన్నగుమ్మడాపురం చేరుకున్నాడు. పశువుల కొట్టంలో మద్యం సేవించి తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. శనివారం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ హుస్సేన్‌బాషా తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

ఏపీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల

కర్నూలు సిటీ: ఏపీ పీజీ ఈసెట్ ప్రవేశ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇందులో మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీకి చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు ఆ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అస్మాతునిసా 14వ ర్యాంకు, ఎం.కళ్యాణ్‌కుమార్ 82వ ర్యాంకు, వి.దినేష్‌కుమార్ 197, కిరణ్‌కుమార్ 219, మాణిక్యకిశోర్ 250, సి.నాగదుర్గ ప్రశాంతి 328, సుధీర్ 369, విక్రమ్ 811, నిత్యశ్రీ 913, పి.అనుష 997వ ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారుఅభినందించారు.

శ్రీ మఠంలో అక్షోభ్యారామప్రియ తీర్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు బెంగళూరుకు చెందిన స్వామిజీ అక్షోభ్యారామప్రియతీర్థులు శనివారం మంత్రాలయం వచ్చారు. వీరికి శ్రీ మఠం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పండిత కేసరి రాజా యస్ గిరిరాజాచార్‌తో కలిసి ప్రవచనాలు వినిపించించారు.

మహిళ దారుణ హత్య


హత్యకు గురైన రాములమ్మ (ఫైల్)

నందికొట్కూరు: స్థానిక మారుతీనగర్‌లో శనివారం సాయంత్రం ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా నివాసముంటున్న మలిరెడ్డి రాములమ్మ(35) అనే వివాహితను తన ఇంట్లోనే గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం గ్రామానికి చెందిన రాములమ్మకు 20 ఏళ్ల క్రితం మండల కేంద్రం పగిడ్యాలకు చెందిన బాలయ్యతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మనస్పర్థల కారణంగా ఎనిమిదేళ్ల క్రితం భార్యభర్త విడాకులు తీసుకున్నారు. రాములమ్మ నగర్‌లో నివాసముంటూ ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. మహిళ హత్య సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం రాత్రి నందికొట్కూరుకు చేరుకుని విచారణ చేపట్టారు. మారుతీ నగర్‌లో సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు. హత్య కేసును త్వరలో ఛేదిస్తామన్నారు.

పండ్లతోటల అభివృద్ధిలో నిర్లక్ష్యాన్ని సహించం

● డ్వామా పీడీ అమరనాథరెడ్డి


జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతి మండలంలో లక్ష్యం మేరకు పండ్లతోటల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, లక్ష్యాలను సాధించకపోతే సంబంధిత ఉపాధి సిబ్బందిపై క్రమ శిక్షణ చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి హెచ్చరించారు. శనివారం తన కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీవోలు, ఈసీ, సాంకేతిక సహాయకులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... 2023–24లో 6,450 ఎకరాల్లో పండ్లతోటలను అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, మండలాల వారీగా లక్ష్యాలు ఇచ్చామన్నారు. అర్హులైన రైతులను గుర్తించడం, ఎస్టిమేట్లు జనరేట్ చేయడం, పండ్ల మొక్కలు నాటుకునేందుకు గుంతలు తవ్వించడం వంటి పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 5,735.93 ఎకరాలకు రైతులను గుర్తించారని, 5125.4 ఎకరాలకు మాత్రమే ఎస్టిమేట్లు జనరేట్ చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ 3,297.75 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి అనుమతులు మంజూరు చేశారని, వీటిల్లో గుంతలు తవ్వకాలను ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి 156.5 ఎకరాల్లోనే గుంతలు తవ్వకం పూర్తి చేశారని, పురోగతి లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పరిపాలనా అధికారి నాగేశ్వరరావు, ప్లాంటేషన్ మేనేజర్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపై దృష్టి

● డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య

కర్నూలు(అగ్రికల్చర్): మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య ఏపీవోలను ఆదేశించారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల ప్రాజెక్టు (ఎన్ఆర్ఎల్ఎం) కింద జిల్లాలో 13 మండలాలు ఎంపిక చేశామని, ఈ మండలాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళల్లోని భూములు కలిగిన మహిళలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో 13 మండలాల ఏపీఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... ప్రతి మండలంలో కనీసం 100 మహిళ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రకారం 1,030 సంఘాలు ఏర్పాటు చేయాలని, ఈ దిశగా ఏపీవోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉద్యాన పంటల ఉత్పత్తులను మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా సేకరించేందుకు ప్రత్యేకంగా కలెక్షన్ సెంటర్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కృష్ణగిరి, ఆస్పరి మండలాల్లో కలెక్షన్ సెంటర్లు సిద్ధమయ్యాయని, మరో ఐదు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వివిధ మండలాలకు ఏపీఆర్ఐజీపీ కింద రూ.60 లక్షల ప్రకారం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు విడుదల చేయడం జరిగిందని వీటిని రికవరీ చేయడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషినల్ పీడీ శ్రీధర్ రావు, డీపీఎం నరసమ్మ, ఏపీవో అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

కర్నూలు కల్చరల్: హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులతో ఉపాధి అవకాశాలు అధికమని పర్యాటక శాఖ కర్నూలు డివిజినల్ మేనేజర్ డి.వి.చంద్రమౌళి రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక హరిత రెస్టారెంట్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సంయుక్తంగా 2011లో తిరుపతిలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అప్‌లెడ్ న్యూట్రిషియన్ కళాశాలను స్థాపించారన్నారు. 2023–2024 సంవత్సరానికి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులు www.sihmtpt.org నుంచి పొందవచ్చని.. ఇతర సమాచారానికి 9502113163, 9701343846 నెంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో కళాశాల అధ్యాపకులు ఎస్.శివరామకృష్ణ చౌదరి, జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనపై ప్రజల్లో సంతృప్తి

● కర్నూలు అభివృద్ధి కోసం త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరుతా
● విలేకరుల సమావేశంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు అహ్మద్‌అలీ ఖాన్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అహ్మద్‌అలీ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు అహ్మద్ అలీ ఖాన్ అన్నారు. శనివారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ 2014లో ఎమ్మెల్యేగా, 2019లో కర్నూలు ఎంపీగా పోటీ చేశానని చెప్పారు. వ్యక్తిగత కారణాలతో ఏడాది క్రితం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశానని, కర్నూలు అభివృద్ధి కోసం త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కుల మతాల మధ్య చిచ్చు పెడుతోందని, ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అలాంటి పార్టీతో పొత్తు కోసం టీడీపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోందన్నారు. టీడీపీ నాయకులది వాడుకొని వదిలేసే మనస్తత్వమని విమర్శించారు. కర్నూలుకు ప్రభుత్వం హైకోర్టు మంజూరు చేసిందని, ఇది అవసరం లేదని, దీని ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేయాలని టీడీపీ నేతలు కోరగా తాను తిరస్కరించానని చెప్పారు. కర్నూలుకు న్యాయం చేస్తుంటే అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించానన్నారు. తాను నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. రైతులతో పాటు పింఛనుదారులు, విద్యార్థులు, యువకులు, చిరువ్యాపారులు, ఉద్యోగస్తు లు, కాంట్రాక్టు కార్మికులు, వైద్యం పొందిన వాళ్ల ఇలా అనేక వర్గాల వారు.. ప్రస్తుత ప్రభుత్వంలో సంతోషంగా ఉన్నట్లు తెలిపారన్నారు.

చదువు ఇష్టం లేక విద్యార్థి పరారీ


విద్యార్థి ప్రవీణ్ (ఫైల్)

జూపాడుబంగ్లా: చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థి పరారయ్యాడు. తర్తూరు గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు రెడ్డిపోగు ప్రవీణ్ కల్లూరు మండలం పెద్దపాడు గ్రామ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల అనంతరం హాస్టల్‌లో వదిలేందుకు కుమారుడితో నాగరాజు ఈనెల 13న నందికొట్కూరు బస్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడ తండ్రి కళ్లుగప్పి ప్రవీణ్ పరారయ్యాడు. రాత్రి వరకు తండ్రి బస్టాండ్ పరిసరాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. ఆ తర్వాత బంధువులు ఇళ్ల వద్ద ఆరా తీసినా సమాచారం లేకపోవడంతో శనివారం జూపాడు బంగ్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య విచారణ చేపట్టారు. నందికొట్కూరు బస్టాండ్‌లో సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించగా హైదరాబాద్ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. హాస్టల్ వెళ్లేందుకు నిరాకరించిన కుమారుడిని తండ్రి మందలించడంతో పరారయ్యాడని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.